

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,29 ఆగస్టు 2025

8 పేజీలు


## మళ్ళీ పెరుగుతున్న గోదావరి వరద

## 15 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

### రుద్రం కోట,వేలేరుపాడు రహదారి పైకి చేరిన నీరు

**వేలేరుపాడు,మేజర్‌న్యూస్ :** అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నది మళ్ళీ పెరుగుతోంది.ఆగస్టు నెలలో రెండవ సారి వరద అంతకంతకు పెరుగుతోంది.వారం రోజుల క్రితం గోదావరి వరద ఉధృతంగా ప్రవహించి భద్రాచలం వద్ద 52 అడుగులకు చేరుకొన్న వరద శాంతించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరలా రెండవ సారి గురువారం ఉదయం నుండి గోదావరి వరద అంతకంతకు పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రానికి 39 అడుగులకు చేరుకొన్న గోదావరి నది క్రమంగా పెరుగుతూ పరవళ్ళు తొక్కుతోంది.ఎడవల్లి, బోల్లపల్లి గ్రామాల మధ్యలో లెవల్ వంతెన పైకి వరద చేరింది.దీంతో 15 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.రాత్రికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు వరద చేరవచ్చని అధికారులు అప్రమత్తమైయారు. వరద బాధితులు ఇప్పటికే అనేక మంది మెరక ప్రాంతాలకు తరలి వెళ్లారు.ఎగువన గల ప్రాజెక్టుల నుండి భారీగా నీటి



విడుదల జరుగుతోంది.శ్రీరామ్ సాగర్ ,కడెం, శ్రీ పాద ,లక్ష్మి బ్యారేజి జలాశయాల గేట్లు ఎత్తివేయడం దిగువన వరద పెరుగుతోంది.గోదావరి ఉపనది శబరి నది సైతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తీర ప్రాంతాల్లో వరదబాధితులు ఆందోళన చెందుతున్నారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా భక్తులు గోదావరిలో స్నానాలకు దిగవద్దని,చేపలు పట్టేవారు,పశుకాపరులు నదిలోకి వెళ్లరాదని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఏలూరు జిల్లాకు బడేటి,

## ప.గో.జిల్లాకు మంతెన ?

### - పరిశీలకుల నివేదికలు పరిశీలిస్తున్న పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు





**ఏలూరు,ఉమ్మడి ప.గో.జిల్లా సూర్య బ్యూరో :** రాష్ట్రంలో ఆయా జిల్లాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల తో పాటు కార్యవర్గాన్ని ప్రకటించడానికి తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం. ఇటీవల దాదాపుగా అన్ని జిల్లాల్లో నూతన కమిటీల ఏర్పాటు కోసం ముగ్గురు చొప్పున పరిశీలకులను పంపించి నాయకుల.కార్యకర్తల అభిప్రాయాలను స్వీకరించారు. పరిశీలనలో మంత్రులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులు ఉన్నారు .ఏలూరులో జరిగిన సమావేశానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు అనకాపల్లి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హాజరయ్యారు. అదేవిధంగా భీమవరంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ,నూకసాని బాలాజీ, శాప్ చైర్మన్ రవి నాయుడు హాజరయ్యారు. ఏలూరులో జరిగిన సమావేశం లో జిల్లా అధ్యక్ష పదవికి 21 మంది నామినేషన్లు వేశారు. ఈ సంస్థాగత సమావేశానికి జిల్లాలోని 176 మంది నాయకులకు మాత్రమే ఆహ్వానాలు పంపారు. రాష్ట్ర కార్యాలయం నుండి ఎవరెవరిని సమావేశానికి పిలవాలో జాబితా కూడా పంపించారు.ఇందులో వైసీపీ నుండి టిడిపిలోకి చేరిన వారిని ఎవరిని ఆహ్వానించక పోవడం గమనార్హం.కాగా ఇప్పటివరకు ఏలూరు జిల్లాకు ప్రస్తుత ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షులుగా

- తరువాయి 2లో..

### తమ్మిలేరుకు పెరుగుతున్న

## వరద ఉధ్ధృతి



**చింతలపూడి, మేజర్‌న్యూస్ :** తెలంగాణలోని వేంసూరు, అశ్వరావుపేట, సత్తుపల్లి మండలాల్లోగతరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తమ్మిలేరు నదికి వరద ఉధ్ధృతి పెరిగింది. ఈవరదతో చాట్రాయి మండలం చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య ఉన్న కాజ్వేపై నీటిమట్టం ప్రమాదకరంగా పెరుగుతోంది. ప్రస్తుతం 500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తున్నట్లు ఏఈ లాజరుబాబు తెలిపారు. ఈపరిస్థితిని అధికారులు

- తరువాయి 2లో..

## వీరభద్ర కాలనీలో ఇళ్లను చుట్టుముట్టిన వరదనీరు



**కామవరపుకోట,మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో కురుస్తున్నభారీ వర్షాల కు వరదనీరు ఇళ్లను చుట్టు ముట్టింది.గత ఎన్నో సంవత్స రాలుగా కాలనీవాసులు డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని వరద నీరు ప్రవహించేలా చేయాలని అధికారులను,ప్రజాప్రతినిధులను కోరుతూనే ఉన్నారు. పట్టించుకునే నాధుడు లేకపోవడంతో భారీవర్షాల సమయంలో వరదనీరు,పాములు కొట్టుకు వస్తున్నాయనిఆందోళనవ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



### పెదవేగి మండలంలో

## ముంచెత్తిన వర్షపు నీరు



**పెదవేగి,మేజర్‌న్యూస్:** అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో పెదవేగి మండలంలో పలు గ్రామాల్లో వరదనీరు ఏరులైపారింది. బుధ వారం తెల్లవారుజామునుంచి ఏకదాటిగా కురిసిన వర్షంతో పెదవేగి మండలంలో వంట పొలాలు, రహదారులపై నీరుపారు తుండడంతో వాహనచోదకులు ప్రమాదకర పరిస్థితిలో ప్రయాణిస్తున్నారు. పెదవేగి తహశీల్దార్ డి.భ్రమరాంబ ఆయా గ్రామాల్లో పర్యటించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. మండలంలో61.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెదవేగి, న్యాయంపల్లి, కూచింపూడి రామశింగవరం, జగన్నాదపురం, విజయరాయి, రాయన్న పాలెం, రాజ్నాలకుంట, నడిపల్లి, బాపిరాజుగూడెం తదితర గ్రామాల్లో కూరగాయల పాదులకు నష్టం ఉంటుందని ఏవో శ్రీనివాస్ చెప్పారు. పెదవేగి– కూచింపూడి మధ్య న్యాయంపల్లి పెద్దచెరువుకు వరదనీరు పోటెత్తడంతో అలుగు పొంది పొర్లుతూ ప్రధాన రహదారిపైనుంచి నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది.ఆయా గ్రామాల్లో పంట పొలాలు వరదనీటితో నిండాయి. అరటి, నిమ్మ, కొబ్బరి,

- తరువాయి 2లో..

### భీమవరంలోనే

## కలెక్టరేట్ నిర్మించాలి

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న డిప్యూటీ స్పీకర్,ఎమ్మెల్యే
- శాసన మండలి చైర్మన్ మోషేను రాజు

- మిగతా 2 లో..

భీమవరం,మేజర్‌న్యూస్



### విశాఖ జనసేన సమావేశంలో

## పాల్గొన్న విప్ నాయకర్



**విశాఖపట్నం,నర్సాపురం, మేజర్‌న్యూస్ :** విశాఖ పట్నంలో గురువారం జరిగినజనసేన లెజిస్లేటరీ సమావేశంలో ప్రభుత్వ విప్,నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన పార్టీ విధానాలు,ప్రజా సమస్యలు,జరగబోయే కార్యక్రమాలపై ఇతర ప్రజాప్రతినిధులతో చర్చించారు. మంత్రి నాదెండ్ల మనోహర్,విప్ బొలిశెట్టి శ్రీనివాస్‌తో నాయకర్ సమావేశమయ్యారు.

# బాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలపై అవగాహన






**– జిల్లా న్యాయ సేవాధికారి కె.రత్న ప్రసాద్**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రం న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్న ప్రసాద్ గురువారం అమీనా పేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికలకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్ధాలపైన అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరు అంకితభావంతో పనిచేయాలని బాల బాలికలు తమ తోటి విద్యార్ధులు పాఠశాలకు లేదా కళాశాలకు గైరహాజరైనవారి వివరాలను తెలుసుకొని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని, బాల్యవివాహాల విషయం ఎవరి దృష్టి కైనా వచ్చిన 1098 లేదా 15100లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. విద్యా దశలో వివాహాలు నిర్వహించిన బాల బాలికల ఆరోగ్యము,వారి భవిష్యత్తు దెబ్బతింటుందని వివాహ వయసు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు నిర్వహించిన పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలియచేశారు. బాల్య వివాహాలు ఇష్టంలేని బాలబాలికలను ప్రభుత్వము వసతి గృహాలలో పునరావాసం కల్పించి వారికి విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని కావున అవసరమైన బాలబాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని భవిష్యత్తును బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పానల్ న్యాయవాది పి.వెంకటేశ్వరరావు వసతి గృహ వార్డెన్ రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు భూసేకరణ పనులు పూర్తి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి కుసుమ్ కార్యక్రమంలో ఏలూరు జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తిఅయ్యాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు తెలియజేసారు. ఏపీ సచివాలయంలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం సాయంత్రం ఎంఐ ట్యాంకులు అండ్ గ్రౌండ్ వాటర్, పీఎం-కుసుమ్ కు సంబంధించిన భూ సమస్యలు, పెన్షన్లు, సానుకూల ప్రజా దృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్,యూరియా లభ్యత అండ్ ధర నిర్ణయం, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు అండ్ అమలు, భారత వైమానిక దళంపై సమస్యలు, అన్న క్యాంటీన్ల నిర్వహణ, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతోరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుచేసేం దుకు 78 ఎకరాల భూమి సేకరణ పూర్తిచేశామని, సోలార్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి. విశ్వేశ్వర రావు, జిల్లాపరిషత్ సీఈఓ శ్రీహరి,డిఆర్డిఏ,డ్వామా పీడీలు ఆర్. విజయరాజు, సుబ్బారావు, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ. భానుప్రతాప్, సిపిఓ వాసుదేవరావు, డిపిఓ కె. అనురాధ, డిఎంహెచ్ఓ డా.పి .జె. అమృతం, డిసిహెచ్ఎస్ డా.పాల్ సతీష్, ఇరిగేషన్ ఎస్ఈ దేవప్రకాష్, ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, ప్రభృతులు పాల్గొన్నారు.

# పాస్టర్ల మధ్య ప్రాంతీయ విభేదాలతో గందరగోళం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** పాస్టర్ల మధ్య ప్రాంతీయ విభేదాలతో గందరగోళం జరిగింది, లయన్స్ కమ్యూనిటీ హాలు నందు జరగాల్సిన అమ్మ తేజ మినిస్ట్రీస్ ప్రార్ధనలను అడ్డుకున్న లోకల్ పాస్టర్స్ అసోసియేషన్ స్థానికంగా ఉన్న సంఘాలు మాత్రమే ప్రార్ధన ఏర్పాటు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చి ఆంధ్రాలో ప్రార్ధన చేయకూడదని నినాదంతో వచ్చిన భక్తులు వెనుతిరిగేలా ఆందోళన జరిగింది, పోలీసుల జోక్యంతో ఇరువర్గాలను సద్ది చెప్పి పంపించారు,అమ్మ తేజ మినిస్ట్రీస్ పాస్టర్ మాట్లాడుతూ దైవానికి ఎల్లలు ఉండవని ప్రజల ఆరోగ్యాల పట్ల వారికున్న బాదసాధకాలను ప్రభు ప్రార్ధన చేసి రూపుమాపాలని ఉద్దేశ్యమై తమ లక్ష్యం అన్నారు, పాలకొల్లుకు చెందిన సనమండ ఎబినేజర్ పాస్టర్ మాట్లాడుతూ దైవ ప్రార్ధనలు ఇతర ప్రాంతాల నుండి వచ్చి నెలకు ఒక సారి వచ్చి నిర్వహించడం సరైన పద్ధతి కాదని సంఘాన్ని ఏర్పాటు చేసుకుని స్థానికంగా ప్రార్ధనలు చేయాలని అన్నారు,

# బిషప్ జయరావు పుట్టిన రోజు సందర్బంగా మోగ మెడికల్ క్యాంపు





ఏలూరు,మేజర్ న్యూస్ : ఏలూరు ఆర్‌సిఎం పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పుట్టిన రోజు ఉత్సవాలు ఘనంగా జరిగాయని పెరికె ఫౌండేషన్ చైర్మన్ పెరికె వరప్రసాదరావు తెలిపారు. బిషప్ పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున మెగా మెడికల్ క్యాంపు నిర్వహించి 500 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి,మందులు ఇవ్వడం జరిగింది. అనంతరం గజమాలతో ఘనంగా సత్కరించారు. 29వ తేదీ శుక్రవారం విజయరాయి జైస్వాల్ పెదవేగి మండలం నందు పెద్ద ఎత్తున జాబు మేళ సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ తాతపూడి ఇమాన్యుల్ సారధ్యంలో నిర్వహిస్తున్నామని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భీమవరంలోనే కలెక్టరేట్ నిర్మించాలి

**– ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న డిప్యూటీ స్పీకర్,ఎమ్మెల్యే**

**– శాసన మండలి చైర్మన్ మోషేను రాజు**

**భీమవరం,మేజర్‌న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్ నిర్మాణంపై వివాదం ముదురుతున్న తరుణంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు గురువారం మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కలెక్టరేట్ భీమవరంలోనే నిర్మించాలనేది ప్రజల ఆత్మగౌరవం, న్యాయబద్ధమైన డిమాండ్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని మండలి చైర్మన్ విమర్శించారు. 'కలెక్టరేట్‌ను ఉండిలో నిర్మించాలని మిమ్మల్ని ఎవరు ? కోరారు. భీమవరంలో స్థలాలు లేవనడం సత్యదూరం అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కలెక్టరేట్ నిర్మాణానికి మార్కెట్ యార్డు భూమిని కేటాయించిందని, నిధులు విడుదల చేసి టెండర్లు కూడా పిలిచారని గుర్తు చేశారు. ఆ నిధులు ఏమైపోయాయి? ప్రజలకు సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికే 72 ఎకరాలు సేకరించిందని, ప్రస్తుత కలెక్టరేట్ సమీపంలో 10 ఎకరాల ఎండోమెంట్స్ భూమి, తహసిల్దార్ కార్యాలయం వద్ద 6 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. 'భూములు ఉన్నా, నిబంధనలు ఉన్నా డబ్బు, పలుకుబడి ఉందని కలెక్టరేట్‌ను తరలించడాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరు' అని ఆయన హెచ్చరించారు. పీఏసీ చైర్మన్ రామాంజనేయులు '20 ఎకరాల్లో కలెక్టరేట్ నిర్మిస్తా' అంటూ కాలయాపన చేయడం సరికాదని మోషేను రాజు ఎద్దేవా చేశారు. ఇరిగేషన్ భూమిలో నిర్మించాలంటే సుప్రీంకోర్టు అనుమతి, క్యాబినెట్ తీర్మానం అవసరమని గుర్తుచేశారు. నిబంధనలు పాటించకుండా పెద్ద అమిరం ఇరిగేషన్ స్థలంలో కలెక్టరేట్ నిర్మించడం అసాధ్యం అని తేల్చి చెప్పారు. కలెక్టరేట్ నిర్మాణానికి మీ దాతృత్వం చూపండి" అని మండలి చైర్మన్ పిలుపునిచ్చారు.

## ఏలూరు జిల్లాకు బడేటి, ప.గో.జిల్లాకు మంతెన ?

**మొదటిపేజి తరువాయి**

కొనసాగుతున్నారు. అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాకు ఏపీఐఐసీ చైర్మన్, ఉండి మాజీ శాసనసభ్యులు మంతెన రామరాజు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పరిశీలకులు జిల్లాలోని శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యుడి తో పాటు ముఖ్య నాయకుల అభిప్రాయాలను సేకరించారు.ఎవరికి పదవిఇస్తే పార్టీ మరింత పటిష్టమవుతుందో అనే విషయాన్ని నాయకుల ద్వారా విడిగా, ప్రసంగాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. జిల్లా అధ్యక్ష పదవి కోసం శాసనసభ్యులు బడేటి రాధా కృష్ణయ్య(చంటి) మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, పెనుమర్తి రాంకుమార్, డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు తదితరులు మొత్తం 21 మంది దరఖాస్తు చేశారు. అదేవిధంగా భీమవరం లో కూడా కొందరు దరఖాస్తులు చేశారు.కానీ పార్టీ అధిష్టానం ఏలూరు జిల్లాకు బడేటి చంటి, భీమవరం జిల్లాకు మరోసారి మంతెన రామరాజును నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఏలూరు జిల్లాలో రకరకాల సామాజిక సమీకరణాల నేపథ్యంలో కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకునికే పట్టం కట్టాలని, భీమవరం జిల్లాకు క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన నాయకునికి అధ్యక్ష సారథ్యం కట్టబెట్టాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీనితో ఏలూరు జిల్లా కు బడేటి చంటి,ప.గో.జిల్లాకు మంతెన రామరాజును త్వరలోనే తెలుగుదేశం అధిష్టానం నియమించనున్నట్లు తెలుస్తోంది.

## తమ్మిలేరుకు పెరుగుతున్న వరద ఉద్ధృతి

**మొదటిపేజి తరువాయి**

నిశితంగా పరిశీలిస్తున్నారు. చింతలపూడి మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.000 టి.ఎం.సి.లు కాగా 28-08-2025 గురువారం సాయంత్రం అందిన సమాచారం ప్రకారం తమ్మిలేరు నీటి మట్టం 343.09 అడుగులు గాను నీటి నిల్వ 0.460 టి.ఎం.సి.లుగాను, గోనెల వాగు నీటి మట్టం 341.88 అడుగులు గాను నీటి నిల్వ 0.813 టి.ఎం.సి.లు గాను ఉంది. ఇన్ ఫ్లో 5000 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 00 క్యూసెక్కులు ఉన్నట్లు జె.ఇ.తెలిపారు.

## పెదవేగి మండలంలో ముంచెత్తిన వర్షపు నీరు

**మొదటిపేజి తరువాయి**

ఆయిల్పామ్ తోటల్లో వర్షపునీరు ముంచెత్తింది. ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షం పడడంతో తమ్మిలేరుకు వరదనీరు పోటెత్తింది. విజయరాయి సమీపంలో తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద అంతకంతకూ పెరుగుతుండడంతో తమ్మిలేరు వైపు ఎవ్వరూ వెళ్ళవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు.

# ఘనంగా బిషప్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు





**పెదవేగి ,మేజర్ న్యూస్ :** పెదవేగి మండలం దుగ్గిరాల గ్రామంలో గల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో కళాశాల చైర్మన్ ,ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో కళాశాల సిబ్బంది విద్యార్థులు బిషప్ 60వ పుట్టినరోజు నిర్వహించారు. బిషప్ పొలిమేర జయరావు కేక్ కట్ చేసి అందరికీ అభినందనలు తెలియజేశారు.తొలత కళాశాల విద్యార్థులు ఊరేగింపుతో నర్సింగ్ కళాశాలకు వెళ్లి అక్కడ నుంచి కళాశాల ఆడిటోరియంలో బిషప్ పుట్టినరోజు కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ సెక్రెటరీ మోజెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆర్చ్ బిషప్ ఆఫ్ ఎమిరేట్స్ బాంబే ముఖ్యఅతిథిగా పాల్గొన్నరు. బెంగుళూరుకు చెందిన సుప్రీం కోర్ట్ సీనియర్ అడ్వకేట్ సర్. జవాక్కిమ్ ఎఫ్ రెషి అతిథులుగా పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల,చాన్సిలర్ ఫాదర్ ఇమ్మానియేల్ పీఠం కోశాధికారి ఫాదర్ బి రాజు వివిధ ప్రాంతాన్ని వచ్చిన గురువులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ స్లేవరాజు దంత కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ ,నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి జాకోబ్ అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

## వివోఏలపై పని భారం తగ్గించాలి : సిఐటియు



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** రకరకాల పనులు ఇవ్వడం ద్వారా ఐకెపి వివోఏ పని భారం పెరుగుతుందని, పలు యాప్ల లాగిన్ చేయడం ద్వారా వివో ఏలకు అనారోగ్యం పాలవుతున్నారని సిఐటి యు జిల్లా కార్యదర్శి ఏ అజయ్ కుమారి ఉన్నారు. గురువారం మార్టేరు రోటరీ క్లబ్లో గడ్డం లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. వేతనాలు ఆరు, మూడు నెలలకు ఒకసారి వేతనాలు చెల్లించడం దారుణమైన విషయమని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తొలగింపులు, వేధింపులు నుండి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వివో ఏల జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ వచ్చే వేతనాల్లో నాలుగైదు వేలు ప్రభుత్వ నిర్వహించే సమావేశాలకు, ఫోన్ల బ్యాలెన్స్ వేయడానికే సరిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ పెనుమంట్ర ఆచంట పోడూరు మండలాల వివోఏలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ అమరవీరుల బషీర్ బాగ్ పోరాటానికి 25 ఏళ్లు



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** విద్యుత్ అమరవీరుల బషీర్బాగ్ పోరాటం నేటి 25 సంవత్సరాలు. 2000 సంవత్సరంలో ప్రపంచ బ్యాంకు షరతులు అమలు చేసి చంద్ర బాబు నాయుడు . విద్యుత్తు భారాలు వ్యతిరేకిస్తూ వేలాదిమంది హైదరాబాదు బషీర్బాగ్ లో ముగ్గురుని తుపాకు గుళ్ళకు బలి తీసుకున్న. చంద్రబాబు 2025 లో తిరిగి విద్యుత్తు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను ప్రైవేటు కంపెనీ వాళ్ళు దోచుకునే విధంగా ప్రధాని కంపెనీకి దోశ పెట్టే విధంగా చంద్రబాబు విధాలు ఉన్నాయని సిపిఎం నాయకులు ఆకులు హరే రామ్ అన్నారు బ్రాహ్మణ చెరువు సెంటర్లో విద్యుత్తు అమరవీరులకు నీవ్వాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా హరే రామ్ మాట్లాడుతూ మరొక విద్యుత్తు పోరాటానికి ప్రజల సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కె పద్మజ నరసింహమూర్తి తాడిపర్తి నరేంద్ర బి విజయకుమార్ ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం



యలమంచిలి, మేజర్ న్యూస్: బషీర్ బాగ్ లో విద్యుత్తు ఉద్యమం జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ ఉద్యమంలో అమరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి,బాలస్వామిలకు గురువారం మండలంలోని చించినాడ అరుంధతి పేట నందు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ముందుగా అమర వీరుల చిత్రపటానికి డి వైఎఫ్ఐ జిల్లా నాయకులు తెన్నేటి స్టాలిన్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, సీనియర్ నాయకులు దేవ సుధాకర్, బొల్లా నరసింహమూర్తి, బాతిరెడ్డి సుగుణ, ఆకుమర్తి పద్మరాజు, జున్ను, సంజయ్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి వేడుకలు



**పెనుమంట్ర, మేజర్ న్యూస్ :** పెనుమంట్ర గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినా యక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజా కార్యక్రమాలు నిర్వహించిన రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం.రాష్ట్ర అధ్యక్షులు.భూపతిరాజు రవీంద్ర రాజు రాధా దేవి దంపతులు కుమారుడు వెంకట నాగ సంజయ్ వర్మ. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గణపతి విగ్రహాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగింది. విగ్రహ దాత సత్య టెక్నాలజీస్ అధినేత కర్రి సుబ్బారెడ్డి . లడ్డు దాత గంటా సాయి వరప్రసాద్ తాతయ్య రాఘవులు 20 కేజీ లడ్డు ఇవ్వడం జరిగింది. స్వామివారి లడ్డును 9వరోజు గురువారం 4వ తేదీన స్వామి వారి ఊరేగింపు సందర్భంగా ఆరోజు మధ్యాహ్నం ఒంట ి గంటకు స్వామివారి లడ్డు పాట పెట్టడం జరుగుతుంది. కావున భక్తులు లడ్డు పాటలో పాల్గొని స్వామివారి లడ్డు ప్రసాదంను స్వీకరించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు.ఈ కార్యక్రమాలు కమిటీ సభ్యులు రవీంద్ర రాజు, గోపిరెడ్డి, విజయ్, వీర వెంకటరెడ్డి, సత్యనారాయణ, రాము, ఐటిఐ రాంబాబు, రంగరాజు, నాగిరెడ్డి, చంటి పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లా పేరు మార్చాలి

### – ఏపీ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యులు జిఆర్కె రంగారావు



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** ఏలూరు జిల్లా పేరును హేలాపురి లేక ద్వారకా తిరుమల జిల్లాగా మార్చాలని ఏపీ రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ నెంబర్ జి ఆర్ కె రంగారావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నో విశిష్ట అర్థాలు కలిగిన హేల అనే పదాన్ని పూర్వ ప్రయోగంగా కలిగిన హేలాపురి ప్రాంతం –శతాబ్దాల క్రితం ఎంతో వారసత్వ–చారిత్రిక సాంస్కృతిక వైభవం–ప్రాముఖ్యత కలిగి ఉండేదని, వేంగి రాజ్యంలో భాగంగాను–బౌద్ధ రాజ్యంలో రాజధానిగాను వెలుగొందింది. కృష్ణ–గోదావరి నదుల మధ్య–గోదావరి నుంచి వచ్చే ఏలూరు కాలువ, కృష్ణా నది నుంచి వచ్చే ఏలూరు కాలవ ,తమ్మిలేరు కలసి కొల్లేరు సరస్సు గా మారే భౌగోళిక సుందరహేలే హేలాపురి అని అన్నారు.ఆంగ్లేయుల పాలనకాలంలో వారికి నోరు తిరగక హేలాపురిని ఏలూరుగా పిల్చుకోవటం, ఆ తర్వాత కూడా దానిని అందిపుచ్చుకొని వలసవాద బానిసత్వంగా నేటికి కూడా మనందరం ఏలూరు అని పిలుచుకోవడం దురదృష్టకరంఅని,ఏ విధమైన స్పందన కలిగించని ఏలూరు అనే పేరును మార్చి ఎంతో మంచి పేరైన హేలాపురి అని పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కనీసం ఏలూరు ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతి రుమల జిల్లాగా పేరు పెట్టిన కొంతవరకు పర్వాలేదని,ఇది నా వ్యక్తిగత అభిప్రాయమని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుతానికి ఏలూరు జిల్లా పరిధిలోని, నూజివీడు ప్రాంతంలో నివసించుచు న్నందున–రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి,జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి,దీని కోసమే ఏర్పడిన కమిటీ దృష్టికి ,ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తానని తెలిపారు.

## గృహ నిర్మాణ శాఖలో వైభవంగా వినాయక చవితి



**ఏలూరు, మేజర్ న్యూస్:** ఎన్నో ఏళ్లుగా సాంప్రదాయ బద్ధంగా జిల్లా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ ఉత్సవాలు ఏలూరులోని స్థానిక జిల్లా కార్యాలయ ప్రాంగణంలోఎంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి సత్యనారాయణ దంపతులు వేద పండితుల సమక్షంలో గణేష్ ఉత్సవాలను ప్రారంభించారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో డి ఈ రామకృష్ణ,డి ఈ రమాకాంత్, ఏ ఈ వివేకానంద, ఏ ఈ సురేష్ బాబు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉండి పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**ఉండి ,మేజర్ న్యూస్:** ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలో మందులు, ల్యాబ్, స్టాఫ్ రూమును, పలు విభాగాలను తనిఖీ చేశారు. ఓపి రికార్డులతో పాటు సిబ్బంది హాజరు పట్టి పరిశీలించారు. పీహెచ్సీకి సంబంధించి ఎంతమంది పనిచేస్తున్నారు. ఫీల్డ్ కి ఎంతమంది వెళ్లారు. ఇక్కడ ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారు పలు వివరాలను మెడికల్ ఆఫీసర్ ని అడిగి తెలుసుకున్నారు. టిబి, హెచ్ఐవి, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులు గురించి,పిహెచ్‌సి పరిధిలో గర్భిణీ స్త్రీలు వివరాలు వారిలో రక్తహీనతతో బాధపడే వారు ఎవరైనా ఉన్నారా వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాస్పటల్‌కు వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఇక్కడ మీకు వైద్య సేవలు బాగున్నాయా సదుపాయాలు ఎలా ఉన్నాయి. డాక్టర్లు అందుబా టులో ఉంటున్నారా, మీకు అవసరమైన మందులు ఇస్తున్నారా అని పలు విషయాలను అడిగారు.

రోగుల నుంచి మంచి స్పందన రావడంతో కలెక్టర్ పిహెచ్సి సిబ్బందిని పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్సీ పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీల ఆరోగ్య తదితర వివరాల నమూనా పట్టికను కలెక్టర్ చూసి చాలా బాగా నిర్వహిస్తున్నారు అని డాక్టర్ ను ప్రశంసిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వైద్యం కొరకు వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగాలని వారికి ఉత్తమమైన సేవలను అందించాలని అన్నారు. ఆకస్మిక తనిఖీలో తహసిల్దార్ నాగార్జున, డాక్టర్ పి ఎల్ సునంద, సిహెచ్ ఓ ఆర్ కృష్ణ కుమార్, హెల్త్ సూపర్వైజర్ పి.రామచంద్ర రావు, స్టాఫ్ నర్స్ బి.సువర్ణ బాయ్, ఎం ఎల్ హెచ్పి టి.స్పందన, తదితరులు పాల్గొన్నారు.

# బాబ్జికి శుభాకాంక్షలు తెలిపిన దేశం ఇన్చార్జి రామరాజు

**విజయవాడ/నరసాపురం,మేజర్ న్యూస్ :** విజయవాడలోని (కుంచనపల్లి) శ్రీ శ్రీనివాస కన్వెన్షన్లో గురువారంజరిగిన తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చైర్మెన్ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలోటీడీపీ జిల్లా అధ్యక్షులు అబ్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీఇంచార్జ్ పొత్తూరిరామరాజు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా రామరాజు బాబ్జికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అప్పగించిన బాధ్యతలలో మెరుగైన ఫలితాలు సాధించాలని రామరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వం





**– చంద్రబాబు హయాంలోనే మహిళలకు పెద్ద పీట**

**– రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ : ఎమ్మెల్యే రాధాకృష్ణ**

**తణుకు,మేజర్ న్యూస్ :** మహిళలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా గుర్తింపు తీసుకువచ్చింది స్వర్గీయ నందమూరి తారక రామారావు వల్లనే అని అదే ఒరవడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనసాగిస్తూ మహిళ అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను తణుకులో కమ్మ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలో 90 శాతం హామీలను మొదటి ఏడాదిలోనే అమలు చేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన తర్వాత మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టి వారిలో చైతన్యం తీసుకువచ్చారని అన్నారు. అప్పటివరకు ఇంట్లో ఉండే మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాలనే ఉద్దేశంతో రూ. 2 కే బియ్యాన్ని నందమూరి తాకరామారావు ప్రవేశపెట్టాలని అన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మహిళలకు డ్వాక్రా సంఘాల పేరుతో మహిళ అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పెద్దపీట వేస్తూ వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వాని దేనని అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని అన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ఒక చీకటి అధ్యాయంగా జగన్ మోహన్ రెడ్డి పరిపాలన నిలిచిందని చెప్పారు. ఐదేళ్లపాటు జగన్మోహన్ రెడ్డి మోసకారి సంక్షేమాన్ని అమలు చేశారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్ర ప్రజల ఖాతాలో డబ్బులు జమ చేసి మళ్లీ తిరిగి వెనక్కి లాక్కునే వారని ఆరోపించారు.

తణుకు నియోజకవర్గంలోని 453 స్వయం సహాయక సంఘాలకు రూ.41.03 కోట్లు బ్యాంకు రుణాలు,స్త్రీ నిధి, ఉన్నతి రుణాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రోజా రమణి, తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సిరిగినీడి రాజ్యలక్ష్మి, చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళ దేవి, అత్తిలి, తణుకు ఏఎంసీ చైర్మన్లు దాసం ప్రసాద్, కొండేటి శివ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సముద్రపు నాచు సాగు ద్వారా అదనపు ఆదాయం

**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సముద్రపునాచు సాగు ద్వారా ఎస్ హెచ్ జిలు అదనపు ఆదాయం ఆర్జించడానికి తోడ్పాటునందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం మండలంలోని పెద్దమైనవానిలంక డిజిటల్ భవన్ నందు జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ సహకారంతో ఎస్ హెచ్ జి మహిళలకు అందిస్తున్న సముద్రపునాచు సాగు శిక్షణా తరగతులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారన్నారు. చేపల వేట మాత్రమే కాకుండా, ఇతర ఉత్పత్తుల ద్వారా కూడా ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తీరప్రాంతం అయిన చినమైనవానిలంక, పేరుపాలెం బీచ్ ప్రాంతాలలో త్వరలో పైలట్ ప్రాజెక్టుగా సీవీడ్ సాగు చేసేందుకు స్వయం సహాయక బృందాలకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా సముద్రపునాచు సాగు ద్వారా ఆదాయాన్ని పొందేందుకు నేడు శిక్షణా తరగతులను ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఎస్ హెచ్ జి లకు అవసరమైన రుణ సదుపాయాన్ని అందించడంతోపాటు, అన్ని విధాలుగా జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తుందన్నారు. ఇది తక్కువ ఖర్చుతో కూడిన స్థిరమైన ఆదాయ వనరుగా చెప్పవచ్చన్నారు. దీనికి ఎరువులు, మంచినీరు లేదా వ్యవసాయ యోగ్యమైన భూమి అవసరం లేదని, కేవలం సముద్రం లోపల సాగు చేయడం అని తెలిపారు. సముద్రపునాచు సాగుకు 40 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ కెఎస్వి నాగలింగాచార్యులు మాట్లాడుతూ మల్టీపాయింట్ మూరింగ్ వ్యవస్థతో తేలియాడే హై-డెన్సిటీ పాలిథిలిన్ తెప్పలను ఉపయోగించి ట్యూబ్-నెట్ టెక్నిక్ అభివృద్ధి చేయబడి సముద్రపునాచు సాగు చేయడం జరుగుతుందన్నారు. తీరం నుండి 100 మీటర్ల దూరంలో నిర్వహించబడుతుందని, స్థానికులకు గణనీయమైన ఆదాయాన్ని అందిస్తుందన్నారు. పొడి సముద్రపు పాచి కిలోకు రూ.80 -100 ధర లభిస్తుందన్నారు. కప్పాఫికస్, గ్రాసిలేరియా వంటి అధిక-విలువైన జాతుల సాగుపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సీ.ఎం.ఎఫ్.ఆర్.ఐ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జయశ్రీ, డి ఆర్ డి ఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా మత్స్య కోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ మైల వసంతరావు, పెదమైనవాని లంక సర్పంచ్ కొల్లాటి కనకదుర్గ, మత్స్య శాఖ ఏడి ఎల్ ఎల్ ఎన్ రాజు, తహసిల్దార్ ఐవివి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలను పురిట్లోనే చంపటం నేరం

## : ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మొగల్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ఎల్ బి చర్ల సెక్టార్లో అంగన్వాడీ కార్యకర్తలకు పీసీపీయన్ డి చట్టం, పి యం యం ఈ వై అంశాలపై యల్ బి చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కే జెరూష అవగాహనా కల్పించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గ భవాని మాట్లాడుతూ ఆడపిల్లను పురిట్లోనే లింగ నిర్ధారణ ద్వారా గుర్తించి చంపడం నేరమని,ఆడపిల్లను పెంచి, పోషించి చదివించడం ద్వారా సమాజం అభివృద్ధి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి ధనలక్ష్మి, ఎం పి హెచ్ ఓ శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న బాబు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులనే వినియోగిద్దాం - ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మిద్దాం

**– వినాయక చవితి వేడుకల్లో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ**



**భీమవరం,మేజర్ న్యూస్:** స్వాతంత్ర సమరయోధులు బాల గంగాధర తిలక్ స్ఫూర్తితో గణేష్ ఉత్సవాలను స్వదేశీ ఉద్యమంతో అనుసంధానిద్దాం అని,ప్రతి ఇంట్లో స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించడం ద్వారా ఆత్మ నిర్భర్ నిర్మాణంలో భాగస్వాములవుదాం అని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ లశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా దేశ ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. భీమవరంలోని బిజెపి నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు బాల గంగాధర తిలక్ గణేష్ ఉత్సవాలను స్వాతంత్ర్య ఉద్యమంతో అనుసంధానించారని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ చెప్పినట్టు 'స్వదేశీ అనేది స్వరాజ్యం యొక్క ఆత్మ' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఎల్లప్పుడూ 'భారతదేశంలో తయారైన ఉత్పత్తులనే కొనుగోలు చేద్దాం" అని పిలుపునిస్తున్నారని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ గుర్తు చేశారు. ప్రతి ఇంట్లో స్వదేశీ ఉత్పత్తులనే వినియోగిద్దాం స్వదేశీని స్వీకరించి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో భాగస్వాములవుదాం" అని ప్రతిజ్ఞ చేయాలని శ్రీనివాస వర్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ వేడుకలలో భూపతిరాజు వెంకటేశ్వరి దేవి, అల్లూరి సాయి దుర్గరాజు, కలిదిండి వినోద్ వర్మ, బుద్ధరాజు బలరామకృష్ణరాజు, పేరిచర్ల సుభాష్, కాగిత సురేంద్ర, అడబాల శివ,వబ్బిలి శెట్టి ప్రసాద్, రమాదేవి,భూపతి రాజు సుబ్బరాజు, ఇంజెటి వెంకటేశ్వర్లు, రాజు,గోవర్ధన్, చదలవాడ విజయ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట వీరులకు సిపిఎం, సిపిఐ నేతల నివాళి




నరసాపురం, మేజర్ న్యూస్ : విద్యుత్ ఉద్యమంలో అమరులైన వీరులకు సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లు అర్పించారు. గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్ వి గోపాలన్ మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు షరతులకు వ్యతిరేకంగా నిర్వహించిన విద్యుత్ పోరాటం చరిత్రలో చిరస్మరణీయం అన్నారు. నాడు ప్రజల కోసం తృణప్రాయంగా ప్రాణాలర్పించిన కామ్రేడ్ బాలస్వామి రామకృష్ణ విష్ణువర్ధన్ రెడ్డి మరణాలు వృధా కావన్నారు.వారు చూపిన సమరశీల బాటలో పయనించాలన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న అధాని అనుకూల విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకంగా పెంచిన విద్యుత్ ఛార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు,పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు,సిపిఐ నేతలు నెక్కంటి క్రాంతి కుమార్, ఆరేటి మృత్యుంజయ, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పొగాకు నారాయణరావు, బూడిద జోగేశ్వరరావు, నోముల కొండ,పైల ప్రసాద్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

**– మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి : జిల్లా కలెక్టర్**





**ఏలూరు, మేజర్ న్యూస్:** జిల్లాలో డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళల సాధికారత కు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వార్షిక రుణ ప్రణాళిక మరియు డ్వాక్రా సంఘాల జీవనోపాదుల కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉన్నదని , ముఖ్యంగా ఉద్యానవనాలు, మత్స్య శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటులో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలోని 41 వేల 525 స్వయం సహాయక సంఘాలకుగాను 39 వేల 396 సంఘాలు 1688 కోట్ల రూపాయలతో సూక్ష్మ రుణ ప్రణాళికలు అందించారని,వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, వారు దరఖాస్తు చేసిన స్వయం ఉపాధి యూనిట్లు వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్వాక్రా సంఘాల మహిళలతో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటుచేసి, పాడి పశువులకొనుగోలు, గొర్రెలు, మేకలు కొనుగోలుకు,ఆక్వారంగంలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు ఆన్లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీతో లబ్ధిదారులకు శిక్షణ అందించి డ్రోన్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ పీడీ ఆర్. విజయ రాజు, వ్యవసాయాధికారి హబీబ్ భాష, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పశుసంవర్ధక శాఖాధికారి డా. గోవిందరాజులు, నాబార్డ్ ఏ జీఎం అనిల్ కాంత్, ఎల్డిఎమ్ నీలాద్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

# మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు



**ద్వారకాతిరుమల, మేజర్ న్యూస్:** శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పరిసర ప్రాంతాలలో ఇటీవల జరిగిన వరస మోటార్ సైకిల్ దొంగతనాలు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్లో వాహనదారులు ఫిర్యాదులుపై కేసు నమోదు జరిగాయి. భక్తుల, స్థానికుల వాహనాలు కొద్దికాలంలోనే చాలా బైకులు దొంగలించడంతో పోలీసు వారు కేసును సవాలుగా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల ప్రకారం ఎడిషనల్ ఎస్పీ కే సూర్యచంద్రరావు, డి ఎస్పీ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ యూ జే విల్సన్, ద్వారకాతిరుమల ఎస్సై టి సుధీర్ తమ సిబ్బందితో కలిసి 27వ తేదీ సాయంత్రం ద్వారకాతిరుమల నుండి వెంకటకృష్ణాపురం గ్రామం మార్గంలో పాడుపడిన రేకుల షెడ్‌లో ఉన్న చాట్రాయి మండలం పోలవరం గ్రామానికి చెందిన కోట రవి అనే ముద్దాయిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనపరుచుకున్నారు. ముద్దాయి కోడిపందాలు,పేకాట వంటి వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడినట్లు ముద్దాయి పై గతంలో ఏలూరు 2 టౌన్, చాట్రాయి పోలీస్ స్టేషన్లో అనేక మోటార్ సైకిళ్ల దొంగతనాలు కేసులు నమోదు కాగా జైలుకు వెళ్లి వచ్చినట్లుగా విచారణలో తేలినట్లు ఎస్సై టి సుధీర్ తెలిపారు. ఈ విచారణలో సిహెచ్ లక్ష్మీనారాయణ, వి జె ప్రకాష్ బాబు, సిబ్బంది ఉన్నారు.

## ఆకర్షిస్తున్న 20 అడుగుల భారీ వినాయక విగ్రహం



**కొయ్యలగూడెం రూరల్ ,మేజర్ న్యూస్:** మండల కేంద్రం పరింపూడి పంచాయితీ పరిధిలో ఉన్న 8వ వార్డులో కమిటీ సభ్యులైన లైటింగ్ వాసు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని కమిటీ వారు తెలిపారు. ప్రతి ఏడాది ఈ ఉత్సవాల్లో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది అనీ ప్రజలు అంటున్నారు. ఇక్కడ జరుగుతున్నటువంటి ఉత్సవాల్లో 20 అడుగుల వినాయకుని విగ్రహం ఈ ఏడాది ఆకర్షణగా నిలిచిందని, చూపరులను సైతం ఆకర్షిస్తుందని అంటున్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణ మహిళ అధ్యక్షురాలు దొడ్డపనేని దుర్గాదేవి కుటుంబ సమేతంగా వచ్చి వరసిద్ధి వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు దొడ్డపనేని ఆంజనే యులు మాట్లాడుతూ ఉత్సవాలు కమిటీ ఆధ్వర్యంలో 11, రోజులు నిర్వహి స్తామని అన్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహి స్తూ 11,వ రోజు అన్నసమరాధనా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందుతూ తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

## హెచ్ఐవి,మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



**ముదినేపల్లి , మేజర్ న్యూస్ :** యువత హెచ్ఐవి బారిన పడకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎం ఎల్ హెచ్ పి ఎం జ్యోతి అన్నారు. ముదినేపల్లి మండలం దాకరం గ్రామంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ , చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ టీం సంయుక్తంగా నిర్వహించిన ఇంటింటి కార్యక్రమంలో కరపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి వత్తుడులు ఉన్న మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. హెచ్ఐవి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫ్లెక్సీలు , ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహనపర్చారు. ఈ కార్యక్రమంలో ఎల్ డబ్ల్యులు సిహెచ్ నాగలక్ష్మి ,టి చంద్రావతి, గ్రామస్తులు ,యువకులు పాల్గొన్నారు.

# 30న భీమవరంలో సంచార జాతుల స్వాతంత్ర్య సభ

**– సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పెంద్ర వీరన్న**



**తణుకు,మేజర్ న్యూస్:** ఈనెల 31వ తేదీన భారతదేశ విముక్తి సంచార జాతుల 73వ స్వతంత్ర దినోత్సవ వేడుక సందర్భంగా, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దినోత్సవ వేడుకలను నిర్వహించాలని ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న పిలుపునిచ్చారు. గురువారం తణుకు నియోజకవర్గలోని పలు గ్రామాల్లో ఉన్న గంగిరెద్దుల కులస్తులను, బుడబుక్కల కులస్తులను కలిసి ఈనెల 30వ తేదీన జరిగే స్వతంత్ర దినోత్సవ వేడుకను విజయవంతం చేయాలని, ఆ కార్యక్రమానికి సంబంధించిన సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి ఆయన,వారితో మాట్లాడుతూ 1949 సంవత్సరంలో భారత ప్రభుత్వం శ్రీ అనంతశయన అయ్యంగార్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసి భారతదేశ వ్యాప్తంగా అధ్యయనం చేసి 1952 ఆగస్టు 31 వ తారీఖున భారతదేశవ్యాప్తంగా నేరస్తులుగా ఉన్న సంచార జాతుల వారిని విముక్తి జాతులుగా గుర్తిస్తూ చట్టం తీసుకురావడం జరిగిందని వీరన్న వివరించారు.

ఈనెల 30వ తేదీన భీమవరం వీరమ్మ పార్కు దగ్గర డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కార్యాలయంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించిన సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బొడ్డు కొండయ్య, చుండూరు నాగరాజు, పొదిలి దానయ్య, కలిదిండి పెద్దిరాజు, ఆకూడి రామారావు, వస్త్రాల శ్రీను, కావాలి భవాని, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు విరిగిపడి దైవ దర్శనానికి వస్తున్న వ్యక్తి మృతి





**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** ద్వారకాతిరుమల చిన్న వెంకన్న దర్శనానికి టు వీలర్ పైవెళ్తున్న వ్యక్తిపై చెట్టుకొమ్మ విరిగిపడటంతో తీవ్రగాయాల పాలైన అతను ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదం ద్వారకాతిరుమల మండలం సూర్యచంద్రరావు పేట సమీపంలో గురువారం చోటుచేసుకుంది. మృతుడు అత్తిలి ప్రాంతానికి చెందిన కె.వెంకట సుబ్బారావు గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ద్వారక తిరుమల ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## వెండి కవచాన్ని బహుకరించిన సంకు కుటుంబీకులు



**కొయ్యలగూడెం,రూరల్ మేజర్ న్యూస్ :** కొయ్యలగూడెంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ వరసిద్ధి వినాయకునికి స్ధానికులు సంకు వారి కుటుంబం చవితి రోజున సుమారు ఆరు లక్షల రూపాయల విలువ గల వెండి కవచాన్ని కుటుంబల సమేతంగా చిన్నారులతో స్వామి వారికి బహుకరించారు. ఈ సందర్భంగా సంకు కుటుంబీకులు మాట్లాడుతూ స్వామివారికి సంకు కుటుంబానికి పూర్వీకులనుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలు కొనసాగిస్తూ వస్తున్నామని సంకు కుటుంబీకులను ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో భోగభాగ్యాలతో దీవిస్తున్నారని కొనియాడారు. అనంతరం కేరళ డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధులలో కవచన్నీ ఊరేగిస్తూ ఆలయ కమిటీ అధ్యక్షుడు మట్ట సూర్యచంద్రరావుకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకు మధు, సంకు కొండలరావు, సంకు కృష్ణ ,శంకు శ్రీను ,వారి కుటుంబీకులు కలిసికట్టుగా వచ్చారు.

# బ్యాటరీ వాహనం బహుకరణ



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన చిన్న వెంకన్న ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు, పిల్లలు, పెద్దవారు, వికలాంగులు, వస్తూ ఉంటారు. వారి దృష్టియా స్ధానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు బ్యాటరీ వాహనాన్ని దేవాలయ ఈవో ఎన్ వి సత్యనారాయణమూర్తి అప్పగించారు. బ్యాంకు సిబ్బంది, ఈవో టెంకాయలు కొట్టి ప్రారంభించారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలువకుండా ఈ వాహన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు వారు తెలిపారు.

# విద్యుత్ ఛార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా ధర్నా

**– జిల్లా,మండల సిపిఎం నాయకులు**



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** విద్యుత్ ఛార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్లు కు వ్యతిరేకంగా పెద్ద కొట్టాయం సెంటర్లో గురువారం జిల్లా కార్యదర్శి రాజు మండల సిపిఎం సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా,మండల సిపిఎం,సిఐటియు తరుపున 25 సంవత్సరాల క్రితం ఇదేరోజు పోలీస్ కాల్పులలో అమరులైన యువకులు రామకృష్ణ, విష్ణువర్ధన్ ,బాలస్వాముల' చిత్ర పటానికి ఆగిరిపల్లి పెద్ద కొట్టాయం సెంటర్లో దండ వేసి నివాళి అర్పించారు. సిపిఎం నాయకులు రాజు, సత్తు కోటేశ్వరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నేటికి 25 సంవత్సరాల క్రితం విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంపుతో ప్రజల పై భారాలకు నిరసనగా జరిగిన మహా ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ బషీర్బాగ్‌లో నిరసన తెలియచేస్తున్న లక్షలాది ప్రజల పై నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత క్రూరంగా జరిపిన పోలీస్ కాల్పులలో రామ కృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిఅను ముగ్గురు యువకులుఅమరులైనారని,మరల ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రభుత్వం (కూటమి) విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ ఛార్జీలు విపరీతం గా పెంచి, స్మార్ట్ మీటర్ల పేరుతో మరింత భారాన్ని వినియోగదారుల పై మోపటానికి పూనుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిపిఎం కార్యదర్శి రాజులపాటి చంటి,ఆగిరిపల్లి సిఐటియు కన్వీనర్ భాష, బండికోటయ్,నల్లమోతు రమేష్ పాల్గొన్నారు.

## గణేష్ యూత్‌కు రూ.5వేలు అందజేసిన పద్దం వెంకటకృష్ణ



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** జీలుగుమిల్లిలోని రామన్నపాలెం కాలనీలో ఏర్పాటుచేసిన గణనాథుడి ఉత్సవాలు పురస్కరించుకొని యూత్ సభ్యులకు రూ.5వేలు అందజేసిన కొమరం భీమ్ యూత్ అధ్యక్షులు పద్దం వెంకటకృష్ణ. గణనాథ పూజా కార్యక్రమాలకు, సాంస్కృతి కార్యక్రమాలు, అన్న సమారాధనకు తనవంతుగా ఆర్థిక సహాయం చేసినట్లు వెంకటకృష్ణ పేర్కొన్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని హిందూ బంధువులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రామన్నపాలెం కాలనీలో ఏ కార్యక్రమం చేపట్టిన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రోత్సహిస్తున్న కొమరం భీం యూత్ అధ్యక్షులు పద్దం వెంకటకృష్ణకు గణేష్ యూత్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## అన్న సమారాధనకు తరలిరండి సొసైటీ మాజీ చైర్మన్ గాంధీ



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** మండలంలోని ములగలంపల్లి గ్రామంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాత ఘంటసాల గాంధీ దంపతులు మరియు ఘంటసాల పాండురంగారావు దంపతులిచే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ చైర్మన్ ఘంటసాల గాంధీ మాట్లాడుతూ గత10 సంవత్సరాల నుండి విగ్రహాన్ని తాము ఇస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. 1 తారీకు సోమవారం గ్రామంలో ఆలయ కమిటీ గ్రామస్తులు సహకారంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరూ తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనంలో పాల్గొనాలి



**కైకలూరు,మేజర్ న్యూస్,** స్థానిక కైకలూరు లోని ఎన్జీవోస్ కాలనీ లో గల రామకృష్ణ సేవా సమితి నందు, గురువారం శైవ క్షేత్ర పీఠాధిపతులు ధర్మో రక్షితి రక్షితః ట్రస్ట్ వ్యవస్థాపకులు శివ స్వామీజీ పత్రికా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూజ్య స్వామీజీలు రాధా మనోహర్ దాస్ ,విరాజా నంద స్వామీజీ ఇంకా పలువురు స్వామీజీల, పీఠాధిపతుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14వ తేదీ న విజయవాడ నందు తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం నందు నిర్వహించ తలపెట్టిన, హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనానికి హిందూ న్యాయవాదులకు సాదర ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ,మానవుడిని మానవుడిగా నిలబెట్టిన, హిందుత్వానికి ప్రతీకలుగా నిలిచిన, ఆధార దేవాలయాలు, మందిరాలు, పీఠాలు,ఆశ్రమాలు, అన్నదాన సత్రాలు వంటి వాటికి నాటి కాలంలో పలువురు దాతలు సమకూర్చినటు వంటి పలు రకాల ఆస్తులు, భూములు పలువురు స్వార్ధపరుల కబంధ హస్తాలలో చిక్కుకుని, అన్యాక్రాంతం అవుతున్న నేపథ్యంలో వాటిని పరిరక్షించే దిశగా పూజ్య స్వామీజీలు ,హిందూ న్యాయవాదులు ఈ వేదిక సాక్షిగా, వాటిని పరిరక్షించే దిశగా అమలు పరచాల్సిన, ఆచరించాల్సిన విధివిధానాలను, భవిష్యత్తు నందు అవలంబించాల్సిన ప్రణాళికలను చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణకుమార్, కట్టా శ్రీను, మేడిశెట్టి పాములు, పలువురు ప్రముఖులు కీర్తి రాంప్రసాద్, సమితి సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర వర్మ తదితరులు పాల్గొన్నారు.

# 50 కేజీల లడ్డు సమర్పించిన ధరావతు కృష్ణ అంజలి దంపతులు



టి.నరసాపురం,మేజర్ న్యూస్ : టీ.నర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా 50 కేజీల లడ్డు ప్రసాదాన్ని ధరావతు కృష్ణ అంజలి దంపతులు బుధవారం సమర్పించారు.

ఈ సందర్భంగా వినాయక కమిటీ సభ్యులు మాట్లాడుతూ కృష్ణాపురం గ్రామస్తులు, భక్తులు సహకారంతో గత 23 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఇలా నిర్వహించడం వల్ల గ్రామంలో ఉన్న ప్రజలందరూ సనస్యామలంగా సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో పాడిపంటలతో అభివృద్ధి చెందుతుందని మంచి ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సంవత్సరం 24వ సంవత్సరం వినాయక ఉత్సవాలు ఎప్పటిలాగానే దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని బుధవారం వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి 3వ తేదీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు మూడో తేదీ రోజున లడ్డు వేలంపాట కూడా నిర్వహిస్తామని అన్నారు. వేలంపాటలో వచ్చిన లడ్డును కూడా ఈ ఉత్సవాల్లో ఉపయోగిస్తున్నట్లు 4వ తేదీ ఊరేగింపు కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

## సబ్ జైలును తనిఖీ చేసిన న్యాయమూర్తి రాజ్యలక్ష్మి



నర్సాపురం,మేజర్ న్యూస్ : అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్ ) ఎస్. రాజ్య లక్ష్మి గురువారం స్థానిక ఉప కారాగారాన్ని తనిఖీ చేశారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలకు అడిగి తెలుసుకున్నారు.ముద్దాయిలకు అందించే ఉచిత న్యాయ సహాయం పై ఆరా తీశారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ప్రిజన్ న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. వంటశాల, ఆహార పదార్ధాలను , స్టోర్ రూం ను,తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎన్.ఆనంద్ బాబు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ నల్ల బసవలింగం సత్రం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణం

– చైర్మన్‌గా దోనేపూడి లోవరాజు ప్రమాణ స్వీకారం
– అభినందించిన జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పల నాయుడు



ఏలూరు,మేజర్ న్యూస్ : శ్రీ నల్ల బసవలింగ సత్రం అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు జనసేన ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఏలూరు నగరం శనివారం పేటలో ఉన్న శ్రీ నల్ల బసవలింగ సత్రం (రామాలయం) దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం గురువారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. తొలుత రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈవో ఎం రాధా, ఏలూరు తో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా దోనేపూడి లోవరాజు, డైరెక్టర్లు గా సిరాపు సత్యనారాయణ, దేవరపల్లి రత్నబాబు, తాడివలస పవన్ కుమార్, జువ్వలగుంట తులసి, కొచ్చర్ల దుర్గ, పిల్ల వెంకటలక్ష్మి భవాని, కిల్లి సత్యవతి, నాగ వెంకట సత్యనారాయణ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ దోనేపూడి లోవరాజు కీ, ఇతర కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఏలూరు నగర పరిధిలో ఉన్న ఈ రామాలయాన్ని జనసేన పార్టీకి పూర్తిస్థాయిలో బోర్డు మెంబర్లను ఇచ్చిన శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) కి కృతజ్ఞతలు తెలిపారు. శనివారపు పేట రోడ్డులో ఉన్న ఈ రామాలయానికి వేమూరి శ్రీధర్ సారథ్యంలో అభివృద్ధి జరిగిందన్నారు. అదేవిధంగా ఈరోజు ప్రమాణ స్వీకారం చేసిన దేవాలయ కమిటీ సభ్యులందరికీ దేవస్థానం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పవన్ కళ్యాణ్ ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆ దేవుని అనుగ్రహంతో పాటు ప్రజల మన్ననలు పొందాలని, దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. దేవస్థానం చైర్మన్ దోనేపూడి లోవరాజు మాట్లాడుతూ దేవస్థాన అభివృద్ధికి అందరి సహకారం తీసుకుని పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు ఇళ్ళా శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు వీరంకి పండు, దెందులూరు నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ గుమ్మడి చైతన్య, 24 వ డివిజన్ టిడిపి ఇంచార్జీ కడియాల విజయలక్ష్మి, 26 వ డివిజన్ టిడిపి ఇంచార్జీ చేకూరి గణేష్, ఎస్సీ నాయకులు లంకపల్లి మాణిక్యాలరావు, స్థానిక కూటమి నాయకులు వేమూరి శ్రీధర్ బాబు, కావూరి వాణిశ్రీ, గుదే నాగమణి పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

– బిజెపి మండల ఇన్చార్జ్ చిటికిన రమేష్



టి.నరసాపురం,మేజర్ న్యూస్ : కార్యకర్తల్లో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ రథసారథి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సారథ్యం కార్యక్రమం అన్ని జిల్లాల్లో విజయవంతం అవుతుందని సారథ్యం కార్య క్రమం ద్వారా పార్టీలో నూతన ఉత్తేజాన్ని నెలకొల్పడం జరుగుతుందని టీ నర్సాపురం మండలం భారతీయ జనతా పార్టీ సారథ్యం కార్యక్రమం ఇన్చార్జి చిటికిన రమేష్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సారథ్యం యాత్ర ఏలూరు జిల్లాలోకి సెప్టెంబర్ మూడవ తేదీన వస్తుందని టీ నర్సాపురం మండలం భారతీయ జనతా పార్టీ సారథ్యం కార్యక్రమం ఇన్చార్జి చిటికిన రమేష్ అన్నారు.

ఈ కార్యక్రమానికి టీ నర్సాపురం మండలం నుండి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన అన్నారు గురువారం మండల పార్టీ అధ్యక్షులు దమ్మిశెట్టి సాయి విశ్వనాథ్ అధ్యక్షతన మక్కిన వారి గూడెం లో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మండల పార్టీ సమావేశంలో రమేష్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు సుమారు టి.నరసాపురం మండలం నుండి 150 మంది కార్యకర్తలు సారథ్యం కార్యక్రమానికి హాజరవుతున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు సాయి విశ్వనాథ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎం హరిబాబు,డి కేశవరావు,ఎం శ్యాంసుందర్రావు,సాదు వరప్రసాద్ పి పూర్ణచంద్రరావు, కేశ్రీలత,సిహెచ్ వినయ్ కె రవీంద్ర ,బి సత్యనారాయణ, కె గంగాధరరావు ,ఎం విష్ణు ఎస్ సురేష్ ,ఎస్ సత్యనారాయణ ,ఎస్ శ్రీను నాగార్జున ,బి ఆదిలక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

## వలవల బాబ్జీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు బడేటి,మద్దిపాటి,రాష్ట్ర కార్యదర్శి దాసరి






విజయవాడ / ఏలూరు,మేజర్ న్యూస్ : టి.పి గూడెం ఇంచార్జి ,రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జీ విజయవాడ ,కుంచనపల్లి ఎస్ కన్వెన్షన్ హాలులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి వారికి తగిన గుర్తింపు లభిస్తుందని దానికి ఉదాహరణ వలవల బాబ్జీ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏపీ ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణ,మద్దిపాటి వెంకట రాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు,పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి,వలవల బాబ్జిని అభినందించారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన డిటి మహేష్



నర్సాపురం, మేజర్ న్యూస్ : పట్టణంలోని ఆరవ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ మారంపూడి మహేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న రేషన్ కార్డుల కంటే స్మార్ట్ కార్డుల వల్ల ఎక్కువ ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. అన్ని గ్రామాల్లోనూ కార్డులు పంపిణీ చురుగ్గా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఎవరికైనా కార్డులు అందకపోతే తాసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోడీలర్ జాను పాముల శ్రీరాములు, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అమర వీరులకు నివాళులు



వేలేరుపాడు,మేజర్న్యూస్ : పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. 25 వ వర్ధంతి పురస్కరించుకొని భోషీర బాగ్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి ,బాలస్వామిలకు ఘనంగా నివాలర్పించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని,స్మార్ట్ మీటర్ల బిగింపు విరమించుకోవాలన్నారు.విద్యుత్ చార్జీలను తగ్గించకుంటే భోషిరాబాగ్ విద్యుత్ ఉద్యమం మాదిరి మరో ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ,కాంగ్రెస్, సిపిఐ ఎంఎల్ ప్రజాపందా,సిపిఎం, నాయకులు మునీర్,సత్తిపండు,సమ్మయ్య, రామారావు ,దుర్గారావు, పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ ఉత్సవాలు



పాలకొల్లు,మేజర్ న్యూస్: స్థానిక బుధవారపు సెంటర్ నందు గణేష్ ఉత్సవాల్లో భాగంగా గురువారం గుర్రం శ్రీనివాసరావు దంపతులచే అత్యంత వైభవంగా పూజలు గావించారు, ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు గావించారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు ఆరెంజ్ అలెర్ట్**
**– ఎంపీ పుట్టా మహేష్ కుమార్**



**ఏలూరు, మేజర్ న్యూస్:** అల్పపీడనం – వాయుగుండం ప్రభావంతో వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలు, మరోవైపు గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు సంబంధిత అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పునరావాసం, రక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక మండలాల్లోని గ్రామాలలో నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా, ప్రజలు నది తీరాలకు దగ్గరగా వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలూరు జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ, గత అనుభవాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీ అధికారులను కోరారు. కుక్కునూరు, వేలేరుపాడు సహా ఏలూరు జిల్లాలో వరద ప్రభావిత మండలాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఏలూరు పట్టణంతో పాటు జిల్లా అంతటా ఎక్కడా డెంగ్యూ, మలేరియా, జ్వరాలు ప్రబలకుండా ఆరోగ్య వైద్యశాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని, అవసరమైన మందులు ప్రజలకు అందించాలని ఎంపీ ఆదేశించారు. అత్యవసరం అయితే ఏలూరు కలెక్టరేట్ వద్ద కంట్రోల్ రూమ్ నెంబర్ 1800-233-1077, 94910 41419 ఫోన్ నెంబర్ల లేదా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయ నంబర్స్ 96181 94377, 98855 19299కు ఎవరైనా కాల్ చేయవచ్చని ఎంపీ తెలిపారు.

# 2న జరిగే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పర్యటన విజయవంతం చేయండి





**– కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**

**భీమవరం,మేజర్ న్యూస్ :** సారధ్యం యాత్రలో భాగంగా సెప్టెంబర్ 2న భీమవరం వస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పర్యటనను ప్రతి బీజేపీ కార్యకర్త భారీ విజయవంతం చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. స్థానిక నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినపూడి శ్రీదేవి ఆధ్వర్యంలో 2న జరిగే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి భీమవరం పర్యటన సన్నాహక సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పివిఎల్ మాధవ్ జిల్లాకు పర్యటనకు వస్తున్న నేపథ్యంలో బీజేపీ సీనియర్ నాయకులు, బూత్, గ్రామ, మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయవలసిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం చాయ్ పే చర్చ కార్యక్రమం తోపాటు పట్టణంలో భారీగా శోభాయాత్ర, అనంతరం బిజెపి జిల్లా విస్తృత స్థాయి జరిగే కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పాల్గొంటారని ఈ పర్యటనను బిజెపి నాయకులు,కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి అన్నారు.

రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ మాట్లాడుతూ రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నోటిఫికేషన్ రాబోతుందని, రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ పర్యటనను పూర్తి విజయవంతం చేయడం ద్వారా బిజెపి బలం నిరూపించవలసిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్ళపూడి రేణుక, నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల సుభాష్ రాజు, సీనియర్ నాయకులు అల్లూరి సాయి దుర్గరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు కలిదిండి వినోద్ వర్మ, గంగరాజు వివిధ మండల అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు, జిల్లా పదాధికారులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి





**– వయోవృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్**
**– జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి భీమవరం మండలం అనాకోడేరు, ఎల్.జి పాడు గ్రామాలలో గురువారం ఫేజ్-3లో ప్రభుత్వ భూముల రీ సర్వే ప్రక్రియ ఏ విధంగా జరుగుచున్నది పరిశీలించి సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ల్యాండ్ రికార్డుకు సంబంధించి విఆర్వోలు అడంగళ్లలో మార్పులు, చేర్పులు ఉంటే ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా సత్వరమే పూర్తి చేయాలన్నారు. జిరాయితి భూముల సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అనాకోడేరు పంచాయితీ ఈలంపూడి గ్రామంలోని 48 నెంబర్ రేషన్ షాపును తనిఖీ చేసి సరుకు వివరాలను, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రతి నెల 26వ తేదీ నుండి 65 సంవత్సరాల పైబడిన వయోవృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంలో భీమవరం ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, డీఎస్ఓ సరోజ, మండల సర్వేయర్ ప్రవీణ్, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలరాజు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు. మండలంలో గ్రామ గ్రామాన వీధివీధిన వినాయక చవితి ఉత్సవాలను యూత్ సభ్యులు ఘనంగా ప్రారంభించారు. దర్బగూడెం, లక్ష్మీపురం గ్రామాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో శాసనసభ్యులు చిర్రి బాలరాజు పాల్గొని వినాయకుడిని గ్రామ ప్రజలతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక చవితి పండుగ అనేది ఏకత్వానికి, సత్సంకల్పాలకు ప్రతీక అని ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఐశ్వర్యం పొందాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలతో కలసి స్వామివారిని దర్శించు కోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు తమ్మన సాంబశివరావు, సొసైటీ అధ్యక్షులు అక్కి శెట్టి ప్రసాద్, బుడిపిటి చిరంజీవి, కూటమి నాయకులు బొర్రా ఏసు, కొప్పుల నాగయ్య, ఇంగుర్తి వెంకటేష్, సన్యాసి, తణుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై మహిళలకు అవగాహన



**నరసాపురం,మేజర్ న్యూస్:** ఉన్నత న్యాయ సేవాధికార సంస్థచేపట్టిన బాల్య వివాహాలు , చిన్న వయస్సులో గర్భం దాల్చితే ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు అనే అంశం పై ఈ నెల 24 నుండి 30 వరకు జరుగుచున్న న్యాయ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా స్థానికమండల సమాఖ్య కార్యాలయం నందు డ్వాక్రా మహిళలకు, అంగన్వాడి సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమం లో ప్యానెల్ లాయర్ కె.శిరీష,స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ పద్మావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏ.ఎన్.ఎంలు శ్రీ లక్ష్మి, ప్రియదర్శిని అవగాహ కల్పించారు. బాల్య వివాహాలు ను అరికట్టాలని, అలా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. వివాహం జరిపిన తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారని, చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల శారీరక, మానసిక వత్తిడికి గురవుతారని,ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి లేదా శిశు సంక్షేమ అధికారికి గానీ, మండల న్యాయ సేవాధికార సంస్థకు గానీ, టోల్ ఫ్రీ 15100కి గానీ తెలపన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ బాల్య వివాహాలు నియత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో పి ఎల్ వి ప్రతిభ రాజీ, అంగన్వాడి సిబ్బంది, ద్వారా మహిళలు, ఏ.ఎన్.ఎం లు,ఆశా వర్క్ లు పాల్గొన్నారు.

## రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఐజి



**నర్సాపురం రూరల్, మేజర్ న్యూస్:** వార్షిక తనిఖీలలో భాగంగాఐజి, జివిజి అశోక్ కుమార్,ఎస్పి నయీమ్ అజ్మీలు గురువారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశం లో ఏలూరు రేంజ్ఐజి జివి జి అశోక్ కుమార్, మాట్లాడారు. తొలుత పోలీస్ గౌరవ వందనం ఐజి అశోక్ కుమార్, ఎస్పి నయీమ్ అజ్మీ లు స్వీకరించారు. డీఎస్పీ శ్రీ వేద స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి డాక్టర్ జి శ్రీ వేద, రూరల్ సీఐ దుర్గాప్రసాద్, టౌన్ సిఐ యాదగిరి, మొగల్తూర్ ఎస్సై జి వాసు, రూరల్ ఎస్సై వెంకట సురేష్, ఎస్సై జయలక్ష్మి, నాగలక్ష్మి సబ్ డివిజనల్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.